నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణోత్సవాన్ని నగరంలోని పలు దేవాలయాల్లో అర్చకులు ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని అన్నదానాలు చేశారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా వేడుకలకు భక్తులు తరలివచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్


రామన్నపేట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మేయర్ సుధారాణి


భాష్యాంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య


టీటీడీ కల్యాణ మండపంలో సీతారాములు కల్యాణ మహోత్సవం


మెట్టుగుట్టపై సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


లేబర్‌కాలనీ చెన్నారెడ్డి కాలనీలోని నాగవిశ్వేశ్వర దేవాలయంలో..


శివనగర్‌లో సీతారామచంద్ర స్వామి కల్యాణ ఘట్టం


కాజీపేట జూబ్లీ మార్కెట్‌లో సీతారాముల కల్యాణ వేడుకలు


లక్ష్మీగణపతి ఆలయంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ దంపతులు


హనుమకొండ గాంధీనగర్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట రాజిరెడ్డి, కమిటీ బాధ్యులు


హనుమకొండ స్నేహనగర్‌లో కల్యాణోత్సవం


హనుమకొండ అశోక కాలనీలో వేడుకలకు హాజరైన భక్తులు


విద్యారణ్యపురి విజయగణపతి నగర్‌లోని విజయగణపతి మందిరంలో..


పోస్టల్‌కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో..


వరంగల్ గణేశ్‌నగర్‌లో వేడుకలకు హాజరైన భక్తులు


శివనగర్ రామాలయంలో తాళి చూపిస్తున్న పూజారి శివరామకృష్ణ శర్మ


లక్ష్మీపురంలో రాములోరి పల్లకీ సేవలో కార్పొరేటర్ వెంకటేశ్వర్లు బృందం


కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలో సీతారాముల కల్యాణం

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డివిజన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట దర్గా, హౌజింగ్ బోర్డు కాలనీ, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, బియాబాని నగర్, భీంనగర్, ఈపీఎఫ్ కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, బాపూజీ నగర్, బాలాజీనగర్, సోమిడి, గణేష్ స్వీట్ షాపు, సెయింట్ థామస్ స్కూల్, ఉప్పలయ్య హోటల్, కాజీపేట మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, హనుమకొండ సుబేదారి శాంతినగర్, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ కూడలి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, విలీన గ్రామాలు కడిపికొండ రాజీవ్ గృహకల్ప, కడిపికొండ టౌన్, సూర్య కుటీర్, బోడగుట్ట, అయోధ్యపురం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు సభలను నిర్వహించనున్నారు. ఈమేరకు సభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సంఘం నాయకులు వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు, విద్యారంగ సమస్యలపై పోరాడిన జార్జిరెడ్డి ఆశయాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ బాధ్యులు ఉడుత గణేష్, రాజేష్, అనిల్, సాయితేజ, సందీప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

డోజర్, టిప్పర్ సీజ్

మడికొండ: ప్రభుత్వ అనుమతి లేకుండా మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రాంపేటలో మొరం తీస్తున్న డోజర్, మొరం తరలిస్తున్న టిప్పర్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం ఆదివారం ఉదయం మడికొండ పోలీసులు పెట్రోలింగ్ కొరకు వెళ్లగా రాంపేట గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా డోజర్ సహాయంతో మొరం తోడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న టిప్పర్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. డోజర్ డ్రైవర్ గాజ దిలీప్, టిప్పర్ డ్రైవర్ గోలి రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ



కాజీపేట: అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ పీసీసీ సభ్యుడు సయ్యద్ రజాలీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కాజీపేట పట్టణంలో ఆదివారం పరామర్శించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి రజాలీకి జరిగిన శస్త్రచికిత్స తదనంతర ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ జక్కుల రమ, అజ్గర్ పాల్గొన్నారు.

సన్‌రైజ్ గ్రామర్ హైస్కూల్ వార్షికోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్ పెరకవాడలోని సన్‌రైజ్ గ్రామర్ హైస్కూల్ ప్రాంగణంలో కరస్పాండెంట్ బాశెట్టి శారద, ప్రిన్సిపాల్ బాశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వడుప్సా వరంగల్ డివిజన్ అధ్యక్షుడు కనకయ్య, ప్రధాన కార్యదర్శి జన్ను విలియమ్స్, కోశాధికారి బాలవారి సుధీర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాశెట్టి సౌమ్య, ఐఐటీ ఇన్‌చార్జ్ బాశెట్టి సాయితరుణ్, పీఈటీ వీరస్వామి, సుజాత, స్వాతి, స్రవంతి, భవాని, సంధ్యారాణి, పూర్ణిమ పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల ప్రవీణ్‌కు క్రైస్తవుల ఘన నివాళి

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ఫాతిమానగర్, కొండపర్తిలోని షూలమ్మీతి పెంతెకొస్తు ప్రార్థన మందిరాల్లో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ఆదివారం సంతాపం తెలిపారు. ఈమేరకు క్రైస్తవులు ఘన నివాళులర్పించారు. రెవరెండ్ షష్మ ప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 400 మంది క్రైస్తవ విశ్వాసులు కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబం కోసం ప్రార్థనలు చేసినట్లు రెవరెండ్ డాక్టర్ డి.ప్రసాద్ తెలిపారు.

డాక్టర్స్‌కాలనీలో అన్నదానం



దేశాయిపేట : వరంగల్ 12వ డివిజన్ డాక్టర్స్ కాలనీ -2లోని వరద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణంలో మట్టెవాడ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు స్థానిక కార్పొరేటర్ కావటి కవితతో పాటు ఇన్‌స్పెక్టర్ గోపి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేసిన ముస్లింలు



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారామ కల్యాణ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పీసు కమిటీ సభ్యులు (ముస్లింలు) మజ్జిగ పంపిణీ చేశారు. పీస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సర్వర్ ఆధ్వర్యంలో 2వేల మందికి మజ్జిగ అందించారు.

కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



హసన్‌పర్తి: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా భక్తులకు కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఎర్రగట్టు దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి, వాకర్స్ అసోసియేషన్ డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్, వాసవి క్లబ్ సభ్యులు చకిలం రాజేశ్వర్‌రావు, గొరిశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, జెండాల పంపిణీ



వరంగల్ చౌరస్తా: శ్రీరామనవమి సందర్భంగా వరంగల్ 28 డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన, నవీన్‌లు దేవతల స్తోత్రాల పుస్తకాలు, జై శ్రీరామ్ స్టిక్కర్లు, జై శ్రీరామ్ జెండాలను ఆదివారం పంపిణీ చేశారు. పిన్నావారి వీధి, బట్టలబజార్, వరంగల్ చౌరస్తా, దుర్గేశ్వర స్వామి దేవాలయం, రామలింగేశ్వర స్వామి దేవాలయం, వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ప్రాంతాల్లో పంపిణీ చేశారు.

పల్లకీ సేవ, తిరు కల్యాణ మహోత్సవం


గోవిందరాజస్వామి పల్లకీ సేవలో భక్తులు

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని గోవిందాద్రి కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీ సమేతుడైన గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని పల్లకీ సేవలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో, భక్త సందోహం నడుమ గోవిందరాజుల దేవాలయానికి చేర్చారు. గోవిందరాజ స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ముదిరాజ్ కులపెద్ద చింతాకుల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్ సమర్పించారు. అనంతరం గోవిందరాజ స్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, ఈఓ మిట్టపల్లి భాస్కర్, ఆలయ ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసాస్వామి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గ్రూప్ -1 ర్యాంకర్ అపూర్వకు సన్మానం

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో హనుమకొండకు చెందిన మంద అపూర్వ 15వ ర్యాంకు సాధించారు. ఈమేరకు హనుమకొండ కనకదుర్గ కాలనీలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత ఆధ్వర్యంలో అపూర్వను పలువురు ఆదివారం సన్మానించారు. ప్రజలకు సేవలందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. 2022లో సివిల్స్‌లో ప్రతిభ కనబరిచి ప్రస్తుతం ఆమె స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్‌గా ముంబాయిలో పనిచేస్తున్నారు. అపూర్వ బీటెక్ సివిల్ ఇంజనీరింగ్, ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌ను ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేశారు. అపూర్వ తండ్రి మంద అశోక్ కేయూలోని ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, తల్లి రజనీదేవి హనుమకొండలోని భీమదేవరపల్లి మాణిక్యపూర్‌లోని ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు.


మంద అపూర్వ దంపతులను సన్మానిస్తున్న కార్పొరేటర్ వసంత, తదితరులు

నాసిరకం హెల్మెట్లతో జాగ్రత్త!

- వాటితో రక్షణ కన్నా నష్టమే ఎక్కువ
- మార్కెట్లో నకిలీ హెల్మెట్ల హవా
- అవగాహన పెంచుకోవాలంటున్న ఆర్టీఏ అధికారులు

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ద్విచక్ర వాహనదారుల్లో 70శాతం మంది తలకు బలమైన గాయాలు కావడం వల్లనే చనిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈక్రమంలో రవాణాశాఖ, పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేశారు. వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై అధికారులు విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ లేని వారికి తనిఖీల్లో జరిమానాలు విధిస్తున్నారు. దాంతో హెల్మెట్ వినియోగించే వారి సంఖ్య పెరిగినా చాలా మంది నాణ్యత లేని నకిలీవే ధరిస్తున్నారు. వాటితో రక్షణ కన్నా నష్టమే ఎక్కువ అని అధికారులు చెబుతున్నారు.

నగరంలో కొంతమంది వ్యాపారులు నాణ్యతలేని నకిలీ హెల్మెట్లతో మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. ఐఎస్ఐ మార్కు పేరుతో వాహనదారులను బురిడీ కొట్టిస్తున్నారు. హెల్మెట్ నాణ్యతపై వాహనదారులకు అవగాహన లేకపోవడం, ఇలాంటి హెల్మెట్ మాత్రమే కొనాలనే నిబంధన లేకపోవడంతో విక్రయదారులు అందినకాడికి దోచుకుంటున్నారు. అధిక ధర గల హెల్మెట్లను పోలిన నకిలీ హెల్మెట్‌ను తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని రవాణా, పోలీసు శాఖ అధికారులు జరిమానా విధిస్తారని భయపడో లేక హెల్మెట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టారనో చాలా మంది వాహనదారులు ఏదో ఒక దాన్ని కొంటున్నారు. దాంతో వ్యాపారులు నాణ్యతకు తిలోదకాలిచ్చి నాసిరకం హెల్మెట్లను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం హైవేలపై, రోడ్లపై ఇబ్బడి ముబ్బడిగా హెల్మెట్లను వీధి వ్యాపారులు విక్రయిస్తున్నారు. నాసిరకం హెల్మెట్లను మహారాష్ట్ర, పుణే, నాందేడ్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇలాంటి హెల్మెట్ల వాడకం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వాహనదారుడి ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని అధికారులు అంటున్నారు. వాటితో లాభం కన్నా.. నష్టమే ఎక్కువగా ఉంటుందని, నకిలీ వాటిని వాడకపోవడమే మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


రోడ్డు పక్కన అమ్ముతున్న నకిలీ హెల్మెట్లు

స్టైల్ కోసం వాడొద్దు..

వాహనచోదకుల ప్రాణాలను రక్షించడానికే హెల్మెట్లను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. స్టైల్ కోసం కాదని రవాణా, పోలీసుశాఖల అధికారులు చెబుతున్నారు. నాణ్యమైన హెల్మెట్ మాత్రమే ప్రాణాలకు రక్షణ ఇస్తుందని, వాహనచోదకులు ఈ విషయాన్ని గుర్తించాలని అంటున్నారు. నాణ్యమైన హెల్మెట్‌కు యూవీ కిరణాలను తట్టుకునే స్పష్టమైన మిర్రర్ ఉంటోంది. హెల్మెట్‌పై తయారు చేసిన కంపెనీ పేరు, ఐఎస్ఐ ట్రేడ్ మార్క్ ఉంటుంది. ఆ ట్రేడ్ మార్క్ లేబుల్‌ను తొలగించడం సాధ్యం కాదు. వివిధ కంపెనీలు తయారు చేసిన హెల్మెట్ల నాణ్యతను పరిశీలించడానికి ప్రత్యేక వ్యవస్థ లేకపోవడం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు పట్టించుకోక పోవడంతో కంపెనీలు నకిలీ హెల్మెట్లను తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయి.

హాఫ్ హెల్మెట్లతో రక్షణ కరువు

ఇటీవల హాఫ్ హెల్మెట్లు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ప్రమాద సమయాల్లో హాఫ్ హెల్మెట్లు తలకు ఎలాంటి రక్షణ ఇవ్వవు. అధికారులు విధించే జరిమానా తప్పించుకోవడానికి మాత్రమే అవి ఉపయోగపడుతాయి. తల మొత్తాన్ని కప్పి ఉంచే వాటినే ఉపయోగించాలి.

నాణ్యమైన హెల్మెట్‌నే వాడాలి

హెల్మెట్ ధరిస్తే తల జుట్టు పాడవుతుందని, బట్టతల వస్తుందని, ఉక్కపోత, ఎండవేడి ఉంటుందని అనుకుంటే పొరపాటు. రోడ్డుపై తక్కువ ధరకు లభించే నకిలీ హెల్మెట్ వాడకం వల్ల మరింత ప్రమాదం పెంచుతుంది. ఐఎస్ఐ మార్కుతో నాణ్యత గల కంపెనీ హెల్మెట్ పెట్టుకుని సురక్షితంగా ప్రయాణం చేయాలి. బైక్‌పై గమ్యానికి క్షేమంగా చేరాలంటే తలకు నాణ్యతగల హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. గ్లామర్ కోసం కాకుండా రక్షణ కోసం హెల్మెట్ ఉపయోగించాలి.

- జైపాల్‌రెడ్డి, ఎంవీఐ, వరంగల్

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


36వ డివిజన్ చింతల్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


హసన్‌పర్తి: పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న కార్పొరేటర్ శివకుమార్


మడికొండలో ఆవిర్భావ వేడుకల్లో బీజేపీ నాయకులు


సోమిడిలో..